# విధి విలాసం

మాదిరాజు లక్ష్మీనరసింహారావు

"అయ్యో! రేపట్లోగా స్కూల్లో జీతం కట్టాలిట లేకపోతే పేరు తీసేస్తారుట"

"ఒరేయి సాంబిగా! నీ కెన్నిసార్లు చెప్పాలిరా నిన్ను బడికివెళ్ళి చావద్దని, మనకి చదువెందుకురా, రాజాలాగా యేదైనా పనికెళ్ళి పొద్దుగూకే వేళ్ళకి రూపాయి డబ్బులు తేక"

"నీకొక్కడు చెప్పేది అలా డబ్బు తాగ తందనాలాడి పాడుచేయకపోతే వాడు చదువుకుంటానంటుంటే స్కూల్లో మూడు రూపాయలు కట్టకూడదూ" అని సాంబుతల్లి అన్నది.

'సరేలే నాకెందుకులేని షోని గొడవ మీ ఏడుపు మీరు యేడవండి' అని బయటకు నడిచాడు తాగుబోతు కోటిగాడు.

సాంబు పసి మనసులో ఒక్కటే కోరిక తను పెద్ద చదువు చదవాలని కాని అందరిలాగే చదువుకోవాలంటే డబ్బులేవి? పోయిన నెలలో స్కూల్ జీతం లెక్కల మాష్టరుగారు కట్టారు. అందరి తండ్రుల్లాగా తన తండ్రి చదువుకొని ఉంటే తనకీ బాధ ఉండేదికాదు. తన తండ్రి ఊరి త్రాగుబోతు తను త్రాగుబోతువాడి కొడుకు. అందరూ తన్ని ఎగతాళి చేస్తున్నారు. కట్టుకోవటానికి సరయిన గుడ్డలుకూడాలేవు. యింకా స్కూల్ పరిక్షలు మూడు రోజులున్నాయి. ఈపరిక్షల్లో మొదటిమార్కు వచ్చినవారికి పాతికరూపాయలు బహుమతి యిస్తారుట. స్కూల్లో అందరూ తనకే వస్తుందంటున్నారు. కాని యేం లాభం రేపటి లోపల స్కూల్లో జీతం కట్టకపోతే పరిక్షలకు రానీయరు.

అయ్య డబ్బు లివ్వడు. తను యివ్వక పోగా అమ్మదాచిన రెండు రూపాయలుకూడా యెత్తుకుపోయి తాగొచ్చాడు. యక్కడా అప్పుకూడా దొరకలేదు. తనకు అప్పిచ్చే దెవరు?

మూడు రూపాయలు

ఎవరిస్తారు? యిక తను చదువు మానెయ్యాల్సిందేనేమో? తనకిక చదువుకునే యోగం లేదేమో?

తన జీతంకోసం యెవ్వరైనా డబ్బులు ధర్మం యిస్తారేమో? అయినా ఈ రోజుల్లో ధర్మం యిచ్చేదెవరు.

మర్చిపోయాను ఈ ఊరి యం. ఎల్. ఏ గారు చదువుకునే పిల్లలకు ఉచితంగా జీతాలు కడ్తారని పేపర్లోకూడా వేశారు.

తను వెళ్ళి అడిగితే తనకే యివ్వవచ్చు.

యం. ఎల్. ఏ గారి యిల్లు పెద్ద వీధిలో ఉంది.

సాంబు యం. ఎల్. ఏ గారింటికి బయలుదేరాడు.

అదొక పెద్ద మేడ

ఆ ఇంటికొక పెద్ద గేటు. ఆ గేటు తన స్కూల్ గేటంత గేటు.

ఆ గేటు దగ్గర ఒక గూర్ఖా కూర్చుని ఉన్నాడు. వాడు చాలా భయంకరంగా ఉన్నాడు. పెద్ద మీసాలు ఉన్నాయి. వాడి బొడ్లో ఒక పెద్ద కత్తికూడా ఉన్నది.

చాలమంది లోపలకు పోతున్నారు. కొందరు లోపలనుంచి బయటకు వస్తున్నారు. అందరూ మంచి మంచి గుడ్డలు వేసుకొని ఉన్నారు. కొందరు కార్లలోకూడా వస్తున్నారు. యెవర్నీ యేమి అనటంలేదు. తన్నుకూడా లోపలకు పంపుతాడేమో?

నెమ్మదిగా సాంబు లోపలపోబోయాడు గేటు దాటుతుండగా వాడు చూశాడు.

"ఏయ్! బాహార్ జావ్" అని ఆగూర్ఖా పెద్దగా అరిచాడు.

భయంతో సాంబు వెనక్కి పరిగెత్తుకు వచ్చాడు.

రోడ్డుమీద నుంచొని వాడు అక్కడినుంచి యెప్పుడు పోతాడా అని చూడసాగాడు.

వాడు అక్కడనుంచి కదిలే సూచన లేం కనపడటంలేదు.

యింతలో వాడి దగ్గరకు పాతికేళ్ళమ్మాయి వచ్చింది. వాడు దాంతో యేదో మాట్లాడుతున్నాడు. ఆ అమ్మాయి నవ్వింది. వాడూ నవ్వుతున్నాడు.

యిదే సమయం తను లోపలకు పోవచ్చు వాడు గేటు వైపు చూడటంలేదు. నెమ్మదిగా సాంబు లోపలకు నడిచాడు.

అది పెద్ద హాలు. దాని నిండా చాలా కుర్చీలు బల్లలూవేసి ఉన్నాయి. ఆ హాలు సుమారు స్కూలు ప్రార్థనామందిరం అంత ఉంది. అయితే ఆయిల్లు యింకెంత ఉందో!

సాంబు ఒక బల్లమీద కూర్చున్నాడు.

అక్కడ కూర్చున్న వాళ్ళందరూ యేదో మాట్లాడుతున్నారు.

"మా అబ్బాయి మెడిసిన్ సీటు గురించి మాట్లాడదామని వచ్చాను'అని అంటున్నాడు ఒక సిల్కు లాల్చి వేసిన పెద్ద మనిషిప్రక్కన కూర్చున్న ఆయనతో.

'మొన్న మన యం. ఎల్. ఏ. గారు హైద్రాబాద్ వెళ్ళేటప్పుడు నా బియ్యం పర్మిట్ కనుక్కోమని చెప్పాను' అని అంటున్నాడు యింకొక ఆయన. యిలా ఆ హాల్లో కూర్చున్నవారందరూ తామువచ్చిన పనుల గురించి చెప్పుకుంటున్నారు.

ఆ హాలు నానుకొని ఒక గది ఉంది.

వచ్చిన వారందరూ ఒకరి తరువాత ఒకరు ఆ గదిలోకి వెళ్ళి వస్తున్నారు. సాంబు ముందు యింకా నలుగురు మనుష్యులు ఉన్నారు. వారిలో ఒకాయన ఉద్యోగం కోసం రికమండేషన్‌కోసం వచ్చాడు.

(తరువాయి 13 వ పేజీలో)

## విధివిలాసం

(8 వ పేజి తరువాయి)

అనలు గురులో ఒకడు లోపలకుపోయ్యాడు

యింకా సాంబు ముందు ముగ్గురు కూర్చుని ఉన్నారు.

ఆ ముగ్గురు తరువాత తనే,

మూడు రూపాయలొస్తాయ్.

స్కూల్లో ఫీజు కడితే పరీక్షలకు వెళ్ళ వచ్చు. తనకు మొదటి బహుమతికూడా వస్తుంది.

పాతిక రూపాయలు... అంత డబ్బు తనింట్లో యెప్పుడూ చూడలేదు. ఆ డబ్బులు వస్తే తనకీ సంవత్సరం స్కూల్ జీతంకు భయంలేదు. ఆ డబ్బులు రాగానే తన తమ్ముడికి ఒక చొక్కా కుట్టించాలి. పాపం వాడికి ఒక్క చొక్కానే ఉంది, అదీ చిరిగి పోవచ్చింది చలికి కప్పుకోవటానికి వాడికి ఒక దుప్పటికూడా కొనాలి.

తన ముందు యింకా ఒక్క ఉంది.

కొద్ది నిమిషాలు గడిచాయి.

... యిప్పుడు సాంబువంతు వచ్చింది.

యిప్పుడు తనే... మూడు రూపాయ లొస్తాయ్.

కాళ్లు వణుకుతున్నాయ్ బిక్కు బిక్కు మంటూ ఆ గదిలోకి వెళ్లాడు. ఆ గదిలో చాలా చల్లగా ఉంది. పైన పంకాలు తిరుగుతున్నాయ్.

యం. ఎల్. ఏ; గారు ఒక సోఫాలో కూర్చొని ఉన్నారు. ఆయనకు యెదురు సోఫాలో యింకో యిద్దరు కూర్చుని ఉన్నారు.

వాళ్ళు ముగ్గురూ గ్లాసుల్తో యేదో యెర్రటి పదార్థం త్రాగుతున్నారు.

సాంబుకు వారిని చూడగానే భయం వేసింది భయంతో వెంట్రుకలు నిక్క బొడుచుకున్నాయి.

యం. ఎల్ ఏ, గారు సాంబు వంక చూశాడు.

'స్కూలు జీతం కట్టాలండి, మూడు రూపాయలండి ... లేకపోతే పేరు తీసేస్తారు. మీరు యివ్వండి ... మూడు రూపాయలు చాలండి ...'

ఏయ్ గూర్ఖా ! అని ఆయన పెద్దగా అరి చాడు.

సాంబు అదిరిపడ్డాడు. భయంలో వణక సాగాడు.

'యేమండీ ! మూడు రూపాయలు చాలండీ ....' సాంబు కంఠంలో నుంచి యిక మాటలు రాలేదు.

ఆ యం. ఎల్. ఏ. కు ఆ అమాయకపు బాలుని మాటలు అర్థం కాలేదు. ఆ పసి బాలుని ఆవేదన అర్థం కాలేదు.

యింతలో బయటునుంచి ఘూర్ఖా పరిగెత్తుకు వచ్చాడు.

సాంబు చొక్కా కాలరు పట్టుకొని బయ టకు లాక్కొచ్చాడు ఆ మొరటు ఘూర్ఖా. దిగులుతో ఆ రోజు బడికి వెళ్లాడు.

ఆ రోజు స్కూల్లో చెప్పినవేవి సాంబు చెవికి వినపడలేదు.

స్కూలు వదిలిపెట్టారు.




DA-65/F10

'రోజంతా కూలీగా జీతం కట్టే యోగం లేదు. ఇంక తను చదువుకునే యోగం లేదేమో? రేపటినుంచి జీతం కట్టకపోతే స్కూల్లో తన పేరు తీసేస్తారు ...'

అని ఆలోచించుకుంటూ నడుస్తున్నాడు.

వెనకనుంచి పెద్దగా కారు హారన్ వినిపించింది.

అది విని సాంబు గాబరాగా చూశాడు తాను రోడ్డుకు అడ్డంగా నడుస్తున్నాడు రోడ్డు ప్రక్కకు నడిచాడు

'... రేపటినుంచి తను బడికి వెళ్ళే అవుసరం లేదు. అమ్మ చెప్పినట్లు యేదైనా పనికి వెళ్ళాలి చదువుకోవటానికి వీల్లేదు ....'

ఆలోచనలతో నడుస్తున్న సాంబు కాళ్ళు అప్రయత్నంగా ఆగిపోయాయి. కళ్ళు ఆత్రంగా చూశాయి.

'నల్లటి మనీపర్సు' రోడ్డుమీద పడి వుంది

వణుకుతున్న చేతుల్తో పర్సు తీశాడు దాన్ని తెరిచాడు. దాని నిండా పది రూపాయల కాగితాలు చాలా ఉన్నాయి.

చుట్టూ చూశాడు జనం ఎవరూ లేరు

'ఈ డబ్బుతో తన దరిద్రం తీరవచ్చు.'

'తను స్కూల్లో జీతం కట్టి చదువుకోవచ్చు. తను, తమ్ముడూ, అమ్మా మంచి బట్టలు కొనుక్కోవచ్చు...', అని ఊహించసాగాడు సాంబు

కాని యింతలో సాంబు మనసులో భయం వేసింది.

'పరుల ధనం విషం' అని యెప్పుడో చెప్పిన వీధిబడి మాస్టరుగారు గుర్తుకు వచ్చారు.

'పాపం యెవరు పారేసుకున్నారో? వాళ్లు ఎంత బాధ పడుతున్నారో' అని సాంబు మనసులో జాలి పడ్డాడు.

'యిప్పుడు ఆ డబ్బులు యేం చేయాలో తెలియటేదు' సాంబుకు.

ఆ డబ్బుల పర్సు పోలీసుల కిస్తే వారు ఆ పర్సు వారికి యివ్వవచ్చు.

నెమ్మదిగా పోలీసు స్టేషన్ వైపు నడిచాడు.

ఆ పోలీసు స్టేషన్ బయట ఒక పోలీసు నుంచొని ఉన్నాడు. ఆ పోలీసు చేతిలో ఒక తుపాకీ కూడా ఉన్నది. లోపల సబ్-ఇన్‌స్పెక్టరు కూర్చుని ఉన్నాడు.

సాంబు లోపలకు వెళ్లి సబ్-ఇన్‌స్పెక్టరు గది దగ్గర నుంచున్నాడు.

ససబ్-ఇన్‌స్పెక్టరు సాంబును చూచి లోపలకు పిలిచాడు.

యేం బాబు నీకేం కావాలి? అన్నాడు ఆ సబ్-ఇన్‌స్పెక్టరు

సాంబు భయం జేబులోంచి మనీపర్సు తీసి బల్లమీద పెట్టి, నేను బడినుంచి వస్తుంటే రోడ్డు మీద దొరికిందని అమాయకంగా చూశాడు.

'ఆరే ఇక్కడే పోయిందా అనవసరంగా ఆ త్రాగుబోతోడిమీద అనుమానపడి వాడ్ని అరెస్టు చేశాం' అన్నాడు సబ్-ఇన్‌స్పెక్టరు

సబ్-ఇన్‌స్పెక్టరు యెదురు కుర్చీలో కూర్చున్నాయన పర్సుతీసి డబ్బు లెక్క పెట్టి 'అంతా సరిగ్గానే ఉన్నాయండి' అని అన్నాడు

నీ పేరేమిటబ్బాయ్? అన్నాడు సబ్-ఇన్‌స్పెక్టరు.

'సాంబు'

యేం చదువుతున్నావ్?

'ఫస్టు ఫారమ్ అండి'

మీ నాన్న పేరేమిటి?

'కోటిగాడంటారండి'

'అరే! మీ నాన్ననే మేము అరెస్టు చేశామన్న మాట' అన్నాడు సబ్-ఇన్‌స్పెక్టరు.

'మా నాన్నను యెందుకు అరెస్టు చేశారండి' యేడుపు మొహంతో అన్నాడు సాంబు.

'పర్సు కాజేశాడని అనుమానం కొద్దీ అరెస్టు చేశాం. పర్సు దొరికిందిగా యింకో గంటలో విడిచి పెడ్తాం నువ్వు యింటికి వెళ్లు' అన్నాడు సబ్-ఇన్‌స్పెక్టరు.

'యిందుగో అబ్బాయ్! నీవు చాలా మంచి వాడిలాగా కనపడుతున్నావ్, ఈ ఐదు రూపాయలు దీసుకొని యేదైనా కొనుక్కో' అన్నాడు ఆ పర్సు కామందు.

సాంబు విచిత్రంగా చూశాడు

'ఫరవాలేదు తీసుకో బాబు నీ మంచితనానికి బహుమతిగా యిస్తున్నాను' అన్నాడు ఆ వ్యక్తి

సాంబు ఇన్‌స్పెక్టరు వంక చూశాడు.

'తీసుకోబాబు ఫరవాలేదు' అన్నాడు సబ్-ఇన్‌స్పెక్టరు కూడా.

సాంబు ఆ ఐదు రూపాయల కాగితం తీసుకొని పట్టరాని సంతోషంతో ఇంటికి పరిగెత్తుకు వచ్చాడు జరిగిందంతా తల్లితో చెప్పాడు. తను స్కూల్లో జీతం కట్టి చదువుకోవచ్చని సంబర పడ్డాడు.

ఆ ఐదు రూపాయల కాగితం చూసుకొని ఆ పసిహృదయం ఆనందంతో పొంగిపోయింది

ఆ ఐదు రూపాయలతో తన కష్టాలు పోయినట్లు భావించాడు సాంబు

ఆ ఐదు రూపాయల కాగితం ముంతలో దాచి అన్నం తిని నిద్రపోయాడు భావి కలలు కంటూ.

తెల్లవారింది.

గబ గబా లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాడు. బువ్వ తిని ఉతికిన గుడ్డలు వేసుకొన్నాడు

డబ్బుల కోసం ముంతలో చేయి పెట్టాడు

కాని ఆ రోజు అర్ధరాత్రి పోలీసు స్టేషన్ నుండి ఇంటికి వచ్చిన కోటిగాడు ఆ డబ్బులు పట్టుకుపోయి త్రాగుడికి వదిలించాడు.

శూన్యమైన ముంత సాంబును చూసి వెక్కిరించింది.

[ఈ కథ ఉచిత విద్యాశోధన లేని సమయములో జరిగినట్లు గమనించగోర్తా.]

